క్లుప్తంగా

యువజన విభాగం మండల అధ్యక్షుడిగా వెంకటేష్



వత్సవాయి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా వేమవరం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు నరమనేని వెంకటేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియమించినందుకు ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతం కొరకు రానున్న ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా ఉదయభాను గెలుస్తారన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు చెప్పారు.

180 మందికి వైద్య పరీక్షలు



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని భూచవరం వైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. పలు రకాల వైద్య పరీక్షలు చేస్తామని వివరించారు. అనంతరం 180 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్ కుమార్, కీర్తిరెడ్డి, సూపర్‌వైజర్ వెంకట్రావ్, హెల్త్ అసిస్టెంట్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించిన దుకాణాల తొలగింపు

కంచికచర్ల: జాతీయ రహదారికి ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసిన చిన్న చిన్న దుకాణాలు తొలగించాలని వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే తగు చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ పీ చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి పెట్రోలు బంక్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను మంగళవారం తొలగించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ అక్రమంగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాల వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. రోడ్డు పక్కన దుకాణాలను తొలగించేందుకు వ్యాపారులు సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వీరులపాడు: వీరులపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వట్టికొండ నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను రైతు సంఘం నియోజకవర్గ నాయకుడు చావా శివాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వట్టికొండ చంద్రమోహన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మందూరి ప్రకాశరావు, నాయకులు మహబూబ్ సుభానీ, ప్రసాద్, కోదండరామయ్య, గుల్ అహ్మద్, పలువురు నాయకులు పాల్గొన్నారు. 20 టీములు పాల్గొనగా బుధవారంతో పోటీలు ముగుస్తాయి.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

పెద్దాపురం(వీరులపాడు): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయం వద్ద ఈవీఎంల పనితీరుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య

భీమవరం(వత్సవాయి): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమవరం గ్రామానికి చెందిన పిట్టంపల్లి కోటయ్య (37) కౌలుకు 5 ఎకరాల పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత మూడు ఏళ్ల నుంచి రూ.10 లక్షల మేర అప్పులు ఉన్నాయి. దీంతో గత ఆదివారం ఇంట్లోనే పురుగులమందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. చికిత్స కొనసాగుతుండగానే మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య త్రివేణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.అభిమన్యు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాకారం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- తిరుమలగిరిలో రూ.1.61 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



జయంతిపురంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. జయంతిపురం గ్రామంలో రూ.50 లక్షల ఎస్టీ నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించి 100 మంది లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పట్టాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల వద్దకే పాలన నినాదంతో ప్రతి పనికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట సమస్యలు పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దనే అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఏపీలో ప్రజలు గత ఎన్నికల్లో టీడీపీని 23 సీట్లకే పరిమితం చేశారని, రానున్న ఎన్నికల్లో ఒక్క సీటు గెలిచే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగాల కల్పనలో, తలసరి ఆదాయాన్ని పెంచటంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. సంక్షేమ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు పలు విమర్శలు చేస్తున్నారని రానున్న ఎన్నికల్లో టీడీపీని బంగాళాఖాతంలో కలపటం ఖాయమన్నారు. అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాహోరి నరసింహారావు, నాయకులు బాణావత్ పాండు, మండవ శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జునరావు, నారికేళ నాగభూషణం, గురవయ్య, మోహన్, బద్యా నాయక్, ఎంపీడీవో రమేష్‌బాబు, డీఈ కిరణ్, ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, గ్రామం నుంచి తక్షశిల పాఠశాల వరకు నిర్మించిన రోడ్డు, రూ.1.61 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలకు మేలు చేయటంతో పాటు గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ రవీంద్ర భరద్వాజ్, గ్రామ కన్వీనర్ కరిశ ఇజ్రాయిల్, రాంబాబు, నరసింహారావు, పోతురాజు వసంతరావు, జనార్దన్, మెట్టు ఏడుకొండలు, తాటి రామారావు, నాగబాబు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పథకాలు అందితేనే ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- వేములపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేములపల్లి(కంచికచర్ల): సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు తిరిగి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. తదుపరి గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ఇటువంటి సీఎం తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలని అందరూ సీఎంను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, పసుపులేటి వెంకటేశ్వర్లు, ఉయ్యూరు మల్లారెడ్డి, సుందరరావు, కామా సాంబశివరావు, నాగేశ్వరరావు, మార్త శ్రీనివాసరావు, వీఆర్వో ఎస్‌వీ రామారావు, కార్యదర్శి వనిత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వేములపల్లిలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ఆర్టీవో పద్మావతి

నందిగామ: విద్యాసంస్థల వాహనాలు నడిపే డ్రైవర్లు అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆర్టీవో ఎం. పద్మావతి సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాసంస్థల బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం బస్సులో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలన్నారు. డ్రైవర్తోపాటు బస్సులో సహాయకులు కూడా తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని తెలిపారు. పరిమితికి మించిఎక్కించుకోకూడదని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంవీఐ రాజు, బస్ డ్రైవర్లు, డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న వారు పాల్గొన్నారు.



విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లకు సూచనలిస్తున్న రవాణాశాఖ అధికారులు

పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణాన్ని జాతీయ రహదారిపైకి విస్తరింపజేసి రికార్డు స్థాయిలో అభివృద్ధిపరచి అద్భుతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యం అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక 5వ వార్డులో రూ.3.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి చేయడంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నందిగామ, కోదాడ పట్టణాల మాదిరిగా జగ్గయ్యపేట పట్టణాన్ని కూడా జాతీయ రహదారిపైకి విస్తరించే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను కృషితో పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించనున్నట్లు చైర్మన్ తెలిపారు. అలాగే 30, 31 వార్డులను కలుపుతూ రూ.35 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభోత్సవం చేస్తారన్నారు. కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు తదితరులు

అహింసా మార్గం అనుసరణీయం

గాంధీ వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



వత్సవాయిలో గాంధీ విగ్రహానికి నివాళులు

జగ్గయ్యపేట అర్బన్: గాంధీ అహింసామార్గం అనుసరణీయమని, ఆయన ఆశయ సాధనలో ముందుకు సాగుదామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహానికి, అదే ప్రాంతంలో ఉన్న గ్రంథాలయంలోని గాంధీ చిత్రపటానికి పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత గాంధీ చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫిరోజ్‌ఖాన్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, పార్టీ నాయకులు కాశి కిషోర్, పఠాన్ అక్బర్‌ఖాన్, పాటి సాంబ, వేముల విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి ఆ పార్టీ పట్టణ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాచేపల్లి వీరభద్రరావు, బ్లాక్–1 అధ్యక్షుడు సన్నె రామారావు, సిమ్మసర్తి శ్రీనివాసరావు, మొగిలి వెంకటేశ్వరరావు, కట్టమూరి పండు, ఎస్‌డీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



పేట మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పేట మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో..

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల కొండ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య మహాసభ వర్తక వాణిజ్య కమిటీ చైర్మన్ కొత్త పురుషోత్తం, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త సురేష్‌కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చూపిన బాటలో నడవాలి

వత్సవాయి: గాంధీ చూపిన బాటలో పయనించాలని పలువురు వక్తలు సూచించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌బాబు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రవి, ఎంఈవో ఎల్ నాగరాజు, స్టేషన్‌లో ఎస్ఐ బి. అభిమన్యు, గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వత్సవాయిలోని గాంధీ పార్కు సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు పూలమాలవేసి నివాళులర్పించారు. సంఘ పెద్దలు డోగుపర్తి రామారావు, చిరునోముల రమేష్, పోలా పూర్ణచంద్రరావు, గుర్రం హనుమంతరావు, రాదాహరినాథ్, పల్లపోతుల నాగేశ్వరరావు, యర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొణకంచి(పెనుగంచిప్రోలు): గాంధీ చూపించిన అహింసా మార్గం అనుసరణీయమని గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయం ఆవరణలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ఆశయాలు యువతకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నార్ని వెంకటేశ్వర్లు, ప్రసాద్, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: గాంధీ కలలు కన్న స్వరాజ్యం స్థాపించాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని రామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పి.అరుణ కుమారి అన్నారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సచివాలయం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు. వైద్యురాలు నీలిమ, వైఎస్సార్సీపీ నాయకుడు వీరమాచినేని నాగమల్లేశ్వరరావు, పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, గ్రామపెద్దలు



రామిరెడ్డిపల్లి గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

మహిళాభ్యున్నతే ధ్యేయంగా పాలన

చందర్లపాడు(నందిగామ టౌన్): మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడులో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మంగళవారం ఆయన మహిళలకు అందజేశారు. ముందుగా కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన మాట ప్రకారం ఆసరా నగదును అందించి మహిళా పక్షపాతిగా నిలిచారని గుర్తు చేశారు. మండలంలోని 1562 స్వయం సహాయక సంఘాలలోని 16,566 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.36.88 కోట్ల మేర లబ్ధి జరిగిందని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఒక్క నాలుగవ విడతలోనే రూ. 9.22 కోట్లను నేరుగా మహిళల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మహిళలతో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు శాఖమూరు వెంకట కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, రాయల జానకిరామయ్య, బుగ్గినేని సురేష్, నల్లాని సాయి, పెరమసాని నరసింహారావు, గుడేటి శ్రీను, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న జగనన్న

జగ్గయ్యపేట అర్బన్: డ్వాక్రా అక్కచెల్లెమ్మల విషయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక 1వ సచివాలయంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత అక్కచెల్లెమ్మలను దారుణంగా దగా చేశాడన్నారు. కానీ గత ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళల రుణాలన్నీ మాఫీ చేస్తానంటూ ఇచ్చిన హామీని ఇప్పుడు సంపూర్ణంగా అమలుచేస్తున్నాడని తెలిపారు. ఇప్పటికైనా మహిళలు విస్వసతనీయకు మారుపేరుగా నిలిచిన జగనన్నను మరొక సారి ఆశీర్వాదించాలని కోరారు. 2వ వార్డు కౌన్సిలర్ కొలగాని రాము, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, ఇందిరా మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులు, హాజరు కావాలని కోరారు

ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: క్రీడాకారుల ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారు పోటీపడేలా తీర్చిదిద్దేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారిని మంగళవారం రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, పద్మావతి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, కిషోర్ పాల్గొన్నారు.

70 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: ద్విచక్ర వాహనంలో మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం.. చందాపురం ఫ్లైఓవర్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఓ స్కూటీ వాహనంలో 70 మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలి

మండల సమావేశంలో ఎంపీపీ గాంధీ

పెనుగంచిప్రోలు: అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి పెట్టి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో చేస్తున్న పనుల వివరాలను సమావేశంలో వివరించారు. ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ వూట్ల నాగమణి మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామి నేని ఉదయభాను ద్వారా మండలంలో కోట్లాది రూపాయిల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటంజరిగిందన్నారు. వైద్యాధికారి పి.ఇందిర మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవల కోసం రూ.5 లక్షలు నుంచి రూ.25 లక్షలకు పెంచటం జరిగిందన్నారు.మండలంలోఇప్పటికే 4,397 ఆరోగ్య శ్రీ కార్డులు ఇచ్చామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలానికి రూ.12 కోట్లు నిధులు వచ్చాయని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ నాడు–నేడు ఫేజ్–2లో 25 అంగన్‌వాడీకేంద్రాలకు మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఏవో రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో ఎం.సాయిహర్ష, డీటీ ఏవో సిద్ధారెడ్డి, పీఆర్, విద్యుత్ ఏఈ సుందరరామయ్య, పూర్ణచంద్రరావు, ఎంఈఓ రవీంద్ర, పశువైద్యాధికారి అనిల్, పీపీవో తిరుపతయ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు జాన్‌మియా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ